క్లుప్తంగా

దత్తసాయి మందిరంలో అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట దత్తసాయి మందిరంలో గురువారం దాత పవన్‌కుమార్ సహకారంతో 500 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీర మోహనరావు తొలుత బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం



మధురానగర్(విజయవాడసెంట్రల్):నిరుపేదలకు సైతం కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తున్నామని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. 197 వార్డు సచివాలయం పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కురిటి శివ, కొండాయగుంట రాము, ఆరోగ్యకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని అప్పుడే లింగ వివక్ష లేని సమాజం ఏర్పడుతుందని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. మహిళల హక్కులను ప్రోత్సహించే సామాజిక మార్పును తీసుకొచ్చేందుకు విద్య దోహద పడుతుందని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ మహిళలు సాధించిన విజయాలను వివరించారు.

ట్రాఫిక్ సిబ్బందికి యూనిఫాం అందజేత



విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న 282 మంది ట్రాఫిక్ సిబ్బందికి ఒక జత యూనిఫాంను పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తన కార్యాలయంలో గురువారం అందజేశారు. ట్రాఫిక్ నియంత్రణ పరికరాలైన మైక్, పోర్టబుల్ స్పీకర్లు, బెల్ హేలర్స్, రేడియం జాకెట్లు, హెల్మెట్, ఎల్ఈడీ బాటిన్స్, వీల్ లాక్స్, డిస్ప్లే ట్రాఫిక్ కోన్స్, ఇన్‌స్టెంట్ బార్ గేట్లు, రిఫ్లెక్టివ్ టేప్‌లను గతంలోనే ట్రాఫిక్ విభాగం అధికారులకు మంజూరు చేశారు. అదేవిధంగా ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న 65 మంది హోం గార్డ్‌లకు రెండు జతల చొప్పున యూనిఫాంలను అందజేశారు. రానున్న వేసవిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి వాటర్ బాటిళ్లు, ఓఆర్ఎస్, కళ్ల జోళ్లతో కూడిన కిట్‌లను త్వరలో అందజేస్తామని సీపీ రాణా తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి, ఏడీసీపీ డి.ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి జగనన్న

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ఆయనతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 29వ డివిజన్ మధురానగర్‌లో గురువారం జగనన్న రావాలి శ్రీనన్న కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి కొబ్బరితోట, గద్దే బాబూరావు రోడ్డు తదితర ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యి ప్రభుత్వ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. దారి పొడవునా మహిళలు పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ వెలంపల్లికి ఘన స్వాగతం పలికారు. ప్రజల ఆకాంక్షల మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నగరం నడిబొడ్డున తాము ఏర్పాటు చేస్తే 29వ డివిజన్ జనసేన నేతలు అంబేడ్కర్ విగ్రహం ఎందుకు ఏర్పాటు చేశారంటూ ప్రశ్నించటం అంబేడ్కర్‌పై జనసేన నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో తెలుస్తుందని అన్నారు. మాట్లాడితే బీసీలు, దళితులకు అండగా ఉంటామంటూ గొప్పలు చెప్పే పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో బీసీలకు ఎన్ని సీట్లు ఇస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నగరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయటం తప్పా అని ప్రశ్నించారు. జనసేన నాయకులు చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని కోరారు. చంద్రబాబు ఇచ్చే స్క్రిప్ట్ చదివి సాయంత్రానికి ప్యాకేజ్ తీసుకునే పవన్ కళ్యాణ్‌కు ఓటు అడిగే అర్హత లేదని తెలిపారు. వంద మంది చంద్రబాబులు, పవన్ కళ్యాణ్‌లు వచ్చినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఎదుర్కోలేరని తెలిపారు. ప్రజల అభిమానంతో రాబోయే ఎన్నికల్లో తాము అఖండ విజయం సాధిస్తామని దీమా వ్యక్తం చేశారు.

త్వరలో ఆర్‌యూబీని ప్రజలకు అంకితం చేస్తాం..

మధురానగర్ వాసుల చిరకాల కోరిక ఆర్‌యూబీని ఈనెల 12వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం ఇస్తామని చెప్పారు. ఇప్పటికే ఆర్‌యూబీ పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, గోవిందు, అక్బర్, రమేష్, సుధాకర్, పి. శ్రీనివాసరావు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే జగనన్న సంకల్పం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా చరిత్రలో తొలిసారి వాటిపై సర్వహక్కులు కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సత్యనారాయణపురంలోని 215వ వార్డు సచివాలయ కార్యాలయంలో 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై సర్వ హక్కులు కల్పించే దస్తావేజు పత్రాలను స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఇంటి స్థలంపై అన్ని హక్కులు ఉండేలా లబ్ధిదారులకు ఉచితంగా స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్స్ అందజేసినట్లు చెప్పారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 22 వేల మందికి ఇళ్ల పట్టాలు అందజేయగా, ఇప్పటికే 16 వేల మంది లబ్ధిదారులకి సంపూర్ణ హక్కు పత్రాలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మరోవైపు నున్న, సూరంపల్లి, కొండపావులూరు లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే పూర్తయిన సుమారు 2వేల ఇళ్లను వారం రోజుల్లో లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో దాదాపు 58 వేల మంది ఆడపడుచులకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ఇప్పటివరకు అక్షరాలా రూ. 440 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు. మహిళలకు ఆర్థిక చేయూతనందించడం ద్వారా కేవలం ఐదేళ్ల కాలంలోనే పేదరికంపై ఈ ప్రభుత్వం నూటికి నూరు శాతం విజయం సాధించిందన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు శనగవరపు శ్రీనివాస్, కమ్మిలి రత్నకుమార్, కృష్ణమోహన్, కూనపులి ఫణి, నిమ్మరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల దస్తావేజులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ శర్వాణిమూర్తి

రజకులకు అన్ని విధాలా అండగా ఉంటా

సెంట్రల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఏపీ రజక సంఘం ప్రతినిదులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రజకులకు అన్ని విధాలా అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఐలమ్మ, సంత్ గాడ్గే బాబా చారిటబుల్ ట్రస్ట్ , ఏపీ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కందగట్ల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఉన్న రజకులంతా వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ బీసీలకు సమున్నత స్థానం కల్పించిందన్నారు. రాబోయే రోజుల్లోనూ ఆయా వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత మేలు చేస్తారని తెలిపారు. రజకుల సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏలూరు లాకుల వద్ద రజక ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేసుకున్నామని, సమావేశాలు నిర్వహణకు అవసరమైన స్థలం కేటాయించాలని కోరారు. ఇతర సమస్యలను వెలంపల్లి దృష్టికి తీసుకువచ్చారు. వెలంపల్లి శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారు. అనంతరం రజక సంఘం నేతలు వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరించారు. రజక సంఘం ప్రతినిధులు టి. రమేష్, పి ఏడుకొండలు, కె.వీర్రాజు, మల్లేశ్వరరావు, పోలవరపు నాగేశ్వరరావు, జి వెంకటేశ్వరరావు, వి. శివప్రసాద్, కొండపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మహా శివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ముత్యాలంపాడులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయం, అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠం, మధురానగర్‌లోని ఉభయరామలింగేశ్వరస్వామి దేవాలయం, రైల్వే కాలనీలోని శివకేశవ దేవాలయం, శివజ్ఞాన పీఠం, పసుపుతోట దత్తసాయి మందిరంలో మహా శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించటానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అవసరమైన క్యూలైన్‌లు ఏర్పాటు చేయటంతో పాటు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని నిర్వాహకులు తెలిపారు. ఏకాదశ రుద్రాభిషేకం, శివ పార్వతుల కలాణం జరుగుతుంది. ఉభయ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటుచేశామని ఆలయ అర్చకులు పొన్నలూరి సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు.

పేదలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న వెలంపల్లి శ్రీనివాస్

పాయకాపురం(విజయవాడరూరల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవడం ఖాయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. 61వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు బల్లం కిషోర్ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె అందించే కార్యక్రమం గురువారం నిర్వహించారు. పోలమ్మతల్లి, నాగేంద్రస్వామి ఆలయం, చిన్న అమ్మవారి గుడి, గంగానమ్మ గుడిలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులు తనకు మెండుగా ఉన్నాయని చెప్పారు. భారీ మెజార్టీతో గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి వచ్చిన తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్నారని తెలిపారు. అనంతరం బల్లం కిషోర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వెలంపల్లి శ్రీనివాస్‌లను గెలిపించడానికి సైనికుల్లా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, పార్టీ నాయకులు వెంకట్రావ్, పదిలం రాజశేఖర్, నాలం బాబు, కమ్మిలి రత్నకుమార్, టిక్యం కృష్ణ,ఆర్.శ్రీను, నాగమణి, ఎం.గోపి, ఎస్‌కె నబీ, రాంబాబు, ఆర్‌ఎస్ నాయుడు, రమణ, ఎం.ఖన్నా, రామరాజు, హరి, రమణారెడ్డి, రఫీ, పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెంట్రల్‌లో విజయఢంకా ఖాయం



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విజయవాడ నగరంలో ఎన్నడూ చూడని అభివృద్ధి జరిగిందని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీలతో విజయఢంకా మోగించనుందని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక 58వ డివిజన్‌లో 'జగనన్న రావాలి... శ్రీనన్న కావాలి' కార్యక్రమం గురువారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన వడ్డెరకాలనీ, ఆర్సీఎం చర్చి రోడ్డు, స్మైల్ హాస్పటల్ రోడ్డు, సెయింట్ ఆన్స్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 58వ డివిజన్‌లో పర్యటించామని చెప్పారు. ఇక్కడ బొండా ఉమా ఆఫీస్ చుట్టూ తిరిగామని, ఈ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలే ఆయన్ను నమ్మలేని స్థితిలో ఉన్నారన్నారు. 58వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీకి మంచి మెజారిటీ వస్తుందన్నారు. బొండా ఉమా నోటికి అడ్డూ అదుపు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను ఉమా గాలికి వదిలేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటన్నింటిని తమ ప్రభుత్వం పరిష్కరించి ప్రజలకు మేలు చేసిందని పేర్కొన్నారు. బొండా ఉమా నోటికి క్లాం వేసి, ఆయన అహంకారాన్ని త్వరలోనే దించుతానని హెచ్చరించారు. పొత్తులతో పోటీ చేసేది టీడీపీ అని, సింగల్ గా పోటీ చేసేది వైఎస్సార్ సీపీ అన్నారు. ఎంతమందితో వచ్చినా రాష్ట్రంలో, సెంట్రల్ నియోజకవర్గంలో గెలిచేది వైఎస్సార్ సీపీయే అని స్పష్టం చేశారు.

ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ



28వ డివిజన్‌లో లబ్ధిదారులతో కనపర్తి కొండలరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం కేటాయించటంతో పాటు రిజిస్ట్రేషన్ చేసి ఇంటి పట్టాలు అందజేస్తున్నామని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. అంబేడ్కర్ కాలనీలో గురువారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటి పట్టాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షులు పెనుమత్స సత్యం, కలవకొల్లు వెంకటేశ్వరరావు. వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 28వ డివిజన్ వార్డు సచివాలయంలో గురువారం ఇంటి పట్టాలను వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి కనపర్తి కొండలరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీను అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు డప్పుకొట్టు శ్రీనివాసరావు, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



31వ డివిజన్‌లో లబ్ధిదారులతో కార్పొరేటర్ పెనుమత్స శిరీష



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలో 281, 282 వార్డు సచివాలయాల వద్ద గురువారం పండుగ వాతావరణంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పట్టాలు అందించారు. తిరుపతమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నెరవేర్చారని పేర్కొన్నారు. 281 సచివాలయ పరిధిలో 220 కుటుంబాలకు, 282 సచివాలయ పరిధిలో 120 కుటుంబాలకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, మాతా మహేష్, సచివాలయాల అడ్మిన్లు, వీఆర్వోలు, వలంటీర్లు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఉత్తర్వుల ప్రకారం ఆర్‌పీఎఫ్ పోలీసుల సమన్వయంతో జీఆర్‌పీ పోలీసులు విజయవాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి, మద్యం, డబ్బు, బంగారం అక్రమ రవాణపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా జీఆర్‌పీ సీఐ పి.శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ టి.చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో 7వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా ఒరిస్సా రాష్ట్రం, ఖర్ధా గ్రామానికి చెందిన సల్మాన్‌ఖాన్ (27) అనే యువకుడి బ్యాగులో 20 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట



విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ ఆదేశం మేరకు దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో దేవాలయ సముదాయంలోని శివాలయంలో గురువారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఉదయం అగ్నికార్యం, మహామంగళ పూజ, అన్నహోమం, యంత్ర ప్రతిష్టను పండితులు ఆగమోక్తంగా నిర్వహించారు. స్వామిజీ నిర్ణయించిన అభిజిత్ ముహూర్తంలో ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ దంపతులు పూజలో పాల్గొన్నారు. భక్తుల శివనామ స్మరణతో పరిసరాలు ప్రతి ధ్వనించాయి. భారతీ తీర్థ స్వామి 74 జన్మదిన వేడుకల సందర్భంగా దేవాలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ చక్రనవావరణ పూజ, ఆది దంపతుల త్రిశతి, సహస్ర నామార్చన నిర్వహించారు. పూర్వ ధర్మాధికారి జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, గండూరి చంద్రమౌళి పాల్గొన్నారు. నిర్వాహకులు రెండు వేలమంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తునట్లు తెలిపారు. రాత్రి 11 గంటలకు లింగోద్భవ సమయంలో మహాకుంభాభిషేకం , శివపార్వతుల కల్యాణం జరుగుతుందని తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే మహిళా సాధికారత

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళా సాధికారత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. బందరు రోడ్డులోని కేడీసీసీ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్ద పీటవేశారని చెప్పారు. రక్షణకు దిశ యాప్ తీసుకొచ్చారని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవులు, పనుల్లో రిజర్వేషన్లు కల్పించారన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ ప్రకటించడమే కాకుండా అమలు చేసి చూపారని తెలిపారు. 108 ఏళ్ల చరిత్ర కలిగిన కేడీసీసీ బ్యాంక్‌కు తనను చైర్మన్‌గా నియమించడమే ఇందుకు నిదర్శనమన్నారు. మహిళల పేర్ల మీద ఇళ్ల పట్టాలు, చేయూత, ఆసరా, అమ్మ ఒడి వంటి పథకాలతో మహిళలను ఆర్థికంగా పరిపుష్టి చేస్తున్నారన్నారు. మహిళలకు ఎన్నో పథకాలు అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బ్యాంకు కస్టమర్లు, ఉద్యోగులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. సిబ్బంది చైర్ పర్సన్ తాతినేని పద్మావతిని సత్కరించారు.

సత్యనారాయణపురంలో పోలీసుల కవాతు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల అవగాహన కల్పించేందుకు సత్యనారాయణపురంలోని పలు వీధుల్లో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఏసీపీ డీఎస్‌వీ ప్రసాద్ సారథ్యంలో ఎస్ఎన్‌పురం సీఐ వెంటక నారాయణ, అజిత్‌సింగ్ నగర్ సీఐ గురు ప్రకాష్, ఉమెన్ ఎస్సైలు భవానీ, సరళల ఆధ్వర్యంలో సివిల్, ఏపీఎస్పీ, ఏఆర్ పారామిలటరీ బలగాలు ఎర్రకట్ట డౌన్ నుంచి గాంధీనగర్, బీఆర్టీఎస్ రోడ్డు, సత్యనారాయణపురం ఎస్ఆర్‌పీ రోడ్డు తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు.